క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: జైలు గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జైలు అధికారులు, సిబ్బంది, ఖైదీలకు హిందూపురం జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు గదులు, పరిసరాలను పరిశీలించారు. దర్వాసన వస్తుండటంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జైలులో ఉన్న వారు రోజూ స్నానం చేయాలన్నారు. ఏయే కేసుల్లో జైలుకు వచ్చారని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను పెట్టుకున్నారా అని ఆరా తీశారు. చివరిగా జైలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ శారద, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజం కోసం పాటుపడదాం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పెనుకొండ: అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప పేర్కొన్నారు. కళాశాలలో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అవినీతి రహిత సమాజంపై అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అవినీతిని నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో బలమైన చట్టాలు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇందు కోసం విద్యార్థులు ఎంతో కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో అవినీతి నిర్మూలనపై ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ కాంతారావు, రంగనాయకులు, యశోదారాణి, డా.ప్రతాప్, చెన్నారెడ్డి, రామన్న పాల్గొన్నారు.

వలంటీర్లను ఆదర్శంగా తీసుకోండి




ఎంపీడీఓ మునిస్వామికి సారనాథ్ స్థూపం అందించిన వలంటీర్ చంద్రశేఖర్

రొళ్ల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సేకరించిన మట్టితో కూడిన కలశాన్ని ఢిల్లీ తీసుకెళ్లిన ఆపదమిత్ర పరమేష్ ఇంటికి చేరుకున్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎర్రకోట నుంచి తెచ్చిన అశోక స్థూపం నమూనా జ్ఞాపికను ఎంపీడీఓ ఆజాద్‌కు అందజేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, ఎంపీటీసీ జగదీష్‌బాబు, నాయకులు గోవిందరెడ్డి, రవికుమార్, మల్లేశప్ప, ఏపీఓ ఓబుళప్ప, కార్యదర్శి రచన తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: వి.అగ్రహారం గ్రామానికి చెందిన వలంటీర్ చంద్రశేఖర్ శనివారం ఎంపీడీఓ మునిస్వామిని కలిశారు. ఢిల్లీ నుంచి తెచ్చిన సారనాథ్ స్థూపం నమూనా జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సేకరించిన మట్టితో కూడిన కలశాన్ని వలంటీర్ చంద్రశేఖర్ ఢిల్లీకి తీసుకెళ్లినట్లు తెలిపారు. చంద్రశేఖర్‌ను ఇతర వలంటీర్లు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండలంలోని హలుకూరు సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. శనివారం మధ్యాహ్నం ఆయన పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. మెనూ ప్రకారం సక్రమంగా భోజనం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రుచికరమైన ఆహారం అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ.లత, సీఆర్టీలు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

బసవనపల్లి సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ మునిస్వామి తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలన్నారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానిస్తున్న నూతన సబ్‌రిజిస్ట్రార్ దామోదర్, తదితరులు

మడకశిర: ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. అభివృద్ధికి సత్వరం తీసుకోవాల్సిన అంశాలను మెడికల్ ఆఫీసర్ వివరించారు. ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. పలు సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులను ఖర్చు పెట్టేందుకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెడుతున్నారన్నారు. పేదలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందించడానికే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వైద్య సిబ్బందిని కోరారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో సమయపాలన పాటించాలన్నారు. సమయానికి విధులకు హాజరుకావాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని తెలిపారు. ఆస్పత్రి భవనాలను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిరేఖ, ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్, ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులు డాక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తికి తరలిరావాలి..

మడకశిర: సీఎం వైఎస్ జగన్ పుట్టపర్తి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి శనివారం ఒక ప్రకటనలో కోరారు. పుట్టపర్తిలో జరిగే కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పారదర్శకంగా వ్యవహరించాలి

మడకశిర: మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే ఆస్తుల క్రయవిక్రయాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని నూతన సబ్ రిజిస్ట్రార్ దామోదర్‌కు ఎమ్మెల్యే తిప్పేస్వామి సూచించారు. శనివారం ఎమ్మెల్యే తిప్పేస్వామిని నూతన సబ్‌రిజిస్ట్రార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మడకశిర నియోజకవర్గం పూర్తిగా కరువు ప్రాంతమన్నారు. వందశాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉంటేనే క్రయవిక్రయాలు చేపట్టాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాప్యం లేకుండా రిజిస్ట్రేషన్లు చేయాలని కోరారు. కార్యాలయంలో సిబ్బంది కొరత నివారించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యాలయంలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు నిర్ణయం భేష్



మంత్రి బుగ్గనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాత్రికేయులు

గోరంట్ల: అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్, ప్రింట్‌మీడియా ప్రతినిధులు అన్నారు. శనివారం పాలసముద్రం సమీపంలోని నాసిన్ సంస్థలో జరగుతున్న పనులను పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డిని జర్నలిస్టులు కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి జర్నలిస్టులు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు మురళి, మస్తాన్, వెంకటశివ, చంద్రమౌళి, అరుణ్, లక్ష్మీకాంత్, మధు, సురేష్ హరి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పురం' అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. శనివారం పట్టణంలోని 10వ వార్డు నానెప్పనగర్‌లోని మోర్ సూపర్ మార్కెట్ పక్కన మున్సిపల్ సాధారణ నిధులు రూ.35 లక్షలతో రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి వార్డులోనూ రోడ్డు, డ్రైనేజీలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని వెల్లడించారు. రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా, వార్డు కౌన్సిలర్ పార్వతి, బీ బ్లాక్ కన్వీనర్ నరేష్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు షాజియా, రహమత్‌బీ, రామచంద్ర, మల్లికార్జున, నాగేంద్రబాబు, రేష్మాబాను, మల్లికార్జున గౌడ్ పాల్గొన్నారు.

సురేష్ కుటుంబానికి ప్రభుత్వ అండ



సురేష్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామానికి చెందిన బోయ సురేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. శనివారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గుంతపల్లికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాం నాయక్, ఎంపీటీసీ సభ్యుడు ఓబిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.వెంకటరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేనాయక్, సమరసింహారెడ్డి, హేమసుందరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామాలయ నిర్మాణానికి భూమిపూజ

గోరంట్ల: మండలపల్లి గ్రామంలో దేవదాయ శాఖ నిధులు రూ.1.2 కోట్లతో చేపట్టిన సీతారామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ మాజీ కమిషనర్ హరిజవహర్‌లాల్ నాయక్, దేవదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాం నాయక్, సర్పంచ్ ప్రమీలమ్మ, నాయకులు సుబ్బారెడ్డి, నరసింహులు, గిరిధర్, శ్రీనివాస రెడ్డి, సోముశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పథకాలు అర్హులందరికీ అందాలి

- సబ్ కలెక్టర్ కార్తీక్



బుళ్లసముద్రం సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

మడకశిరరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలి. అందుకు అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వహించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. శనివారం సాయంత్రం బుళ్లసముద్రం, మణూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలపై వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారం చూపాలన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందలేదని ఫిర్యాదు వస్తే చర్యలు ఉంటాయని గుర్తు చేశారు. సచివాలయాల్లో రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ సకాలంలో సేవలు అందించాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముర్షావలి, ఎంపీడీఓ సోనిబాయి, గ్రామ కార్యదర్శులు మారుతి ప్రసాద్, ఆనంద్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఆటోనగర్ యూనియన్ ఎన్నికలు



నూతన కమిటీ అధ్యక్షుడు అంజాద్

హిందూపురం: హిందూపురం ఆటోనగర్ యూనియన్ ఎన్నికలు శనివారం రసవత్తరంగా జరిగాయి. 2023 నుంచి 2026 వరకు కొనసాగే కమిటీ ఎన్నికకు ఎన్నికలు నిర్వహించారు. పోటీలో గత కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్, మాజీ కమిటీ అధ్యక్షులు అంజాద్, రహేమాన్ అధ్యక్ష స్థానానికి పోటీ పడ్డారు. మొత్తం 576 మంది ఓటర్లు ఉండగా 534 మంది ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. అంజాద్‌కు 302, ఇస్మాయిల్‌కు 206, రహమత్‌కు 16 ఓట్లు పోల్ అయ్యాయి. 85 ఓట్ల అధిక్యతతో ఆటోనగర్ కమిటీ అధ్యక్షుడిగా అంజాద్ విజయం సాధించారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోరంట్ల: ఈనెల 7వ తేదీన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రైతు భరోసా- పీఎం కిసాన్ నిధులు విడుదల చేసేందుకు పుట్టపర్తికి రానున్నారని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. శనివారం మండల పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డిని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

చిలమత్తూరు: రైతు భరోసా-పీఎం కిసాన్ సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఈనెల 7న సీఎం వైస్ జగన్ పుట్టపర్తికి వస్తారని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ అధ్యక్షతన ఉపాధి, వ్యవసాయశాఖ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులతో సీఎం పర్యటనపై సమీక్ష నిర్వహించారు. సభకు వచ్చేందుకు రైతులకు రవాణా, భోజన వసతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వంశీకృష్ణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లేపాక్షి: సీఎం పర్యటన విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శిలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పుట్టపర్తికి విచ్చేసి అక్కడ రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీలత, ఏపీఎం జయచంద్ర, ఈఓఆర్డీ శివన్న, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ నీలావతి, మండల కన్వీనర్ నారాయణ స్వామి, సర్పంచులు ఆదినారాయణ, అశ్వర్థ నారాయణ, మంజునాథ్ పాల్గొన్నారు.

చిలమత్తూరు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు వచ్చిన రాయలసీమ జిల్లాల కో-ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నేతలు పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజారెడ్డి, నాగరాజు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విలువలతో కూడిన విద్యాబోధన అవసరం

హిందూపురం టౌన్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యాబోధన అందించినప్పుడు సమాజం శాంతితో, సన్మార్గంలో నడుస్తుందని ఎంఈఓ గంగప్ప అన్నారు. శనివారం స్థానిక వాసవీధర్మశాలలో పలు మండలాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యా బోధనలో విలువల అనుసంధానంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేటి సమాజంలో మానవతా విలువలు తగ్గిపోతున్నాయన్నారు. ఉపాధ్యాయులు విద్యాబోధనలో విలువలు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యులు మధుసూదన్ గుప్త, రిటైర్డ్ హెచ్ఎం రవి, కిరణ్ పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

సోమందేపల్లి: మండల కేంద్రం నుంచి దాదాపు 70 మంది భక్తులు శనివారం తిరుమలకు పాదయాత్రగా తరలివెళ్లారు. దాదాపు 10 రోజుల పాటు పాదయాత్ర కొనసాగుతుందని భక్తులు తెలిపారు. గ్రామంలో గోవిందనామస్మరణ చేస్తూ ప్రదర్శనగా వెళ్లారు. కొంతమంది దాతలు భక్తులకు అల్పాహారం, బిస్కెట్లు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామ సమీపంలో శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. పరిగి మండలానికి చెందిన గోపాల్, సుబ్రహ్మణ్యం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో వారిపై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లంచ విముక్త పాలనే ధ్యేయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పావగడ: లంచ విముక్త పాలనే ధ్యేయంగా ప్రభుత్వ ఉద్యోగులు పని చేయాలని లోకాయుక్త డీఎస్పీ హరీశ్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో శనివారం నిర్వహించిన 'లంచ గొండి తనంపై పోరాటం' అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యలను పరిష్కరించే పరిజ్ఞానం ఉన్న వారు మాత్రమే మెరుగైన పాలన అందిస్తారని పేర్కొన్నారు. అవినీతిలో ప్రపంచంలోనే భారతదేశం 85వ స్థానంలో ఉందన్నారు. ప్రజలు సమస్యల పరిష్కారానికి కార్యాలయాల వద్దకు వస్తే సంబంధిత అధికారులు వారికి గౌరవం ఇవ్వాలన్నారు. పనులను సత్వరం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ రామరెడ్డి మాట్లాడారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

రొళ్ల: సమాజంలో బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డీటీ సెక్టర్ టీం లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మురళి ప్రైవేట్ పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం సరికాదన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా లేదా రెండు విధిస్తామని తెలిపారు. బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 100 లేక 112 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ యోగానంద్, శ్రీధర్, మహిళా పోలీసులు లతశ్రీ, అరుణ, కుసుమ, హెచ్ఎంలు నరసింహమూర్తి, శ్రీనివాసులు, అంగనవాడీ వర్కర్లు పార్వతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని నాగలూరు పంచాయతీ బండ్లపల్లి గ్రామానికి చెందిన తన కూతురు అదృశ్యమైనట్లు తండ్రి నారాయణస్వామి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణస్వామి కూతురు హిందూపురంలో ఇంటర్ చదువుతోంది. ఈనెల 1వ తేదీన హిందూపురం వెళ్లేందుకు కూతురిని పెనుకొండలో బస్సు ఎక్కించారు. అయితే విద్యార్థిని హాస్టల్‌కు వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాతృ భాషతో జ్ఞాన సంపద

పావగడ: మాతృ భాషతో జ్ఞాన సంపద పెంచుకోవడం సాధ్యమని స్థానిక కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి తెలిపారు. శనివారం కన్నడ రాజ్యోత్సవ వేడుకలను పురస్కరించుకుని తాలూకాలోని తిరుమణి కర్ణాటక పబ్లిక్ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్వి భాష సంస్కృతి ఉన్న పావగడలో కన్నడ పర వాతావరణాన్ని నిర్మించడానికి కన్నడ సాహిత్య పరిషత్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. తాలూకాలోని 103 పాఠశాలలు, కళాశాలల్లో విశాల మైసూరు రాజ్యానికి కర్ణాటక అనే నామకరణం చేసి నేటికి 50 సంవత్సరాలు పూర్తయినట్లు పేర్కొన్నారు. సువర్ణ మహోత్సవం సందర్భంగా విశేష కన్నడ జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగలమడక హోబళి కసాప అధ్యక్షుడు వి.రామాంజి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు మార్పులు, చేర్పులపై స్పెషల్ క్యాంపు



లేపాక్షి మండలం ఉప్పరపల్లిలో ఓటర్ల వివరాలు సేకరిస్తున్న దృశ్యం



రొళ్లలో ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న డీటీ భాగ్యలక్ష్మి

లేపాక్షి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా శనివారం స్పెషల్ క్యాంపు నిర్వహించినట్లు డిప్యూటీ తహసిల్దార్ కుమారస్వామిరెడ్డి తెలిపారు. ఫారం-6కు 22, ఫారం-7కు 9, ఫారం-8కు 16 చొప్పున మొత్తం 47 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఓటరు నమోదుకు స్పందన

రొళ్ల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. మండల వ్యాప్తంగా 32 బూత్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులతో పాటు రెవెన్యూ శాఖ సిబ్బంది కొత్తగా ఓటరు జాబితాలోకి పేర్లు చేర్చేందుకు ఫారం-6 దరఖాస్తులను స్వీకరించారు. రొళ్లలో 114, 115, గుడ్డగుర్కి 119, దాసప్పపాళ్యం 121, 122 పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ప్రత్యేక నమోదును డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇది వరకే 2024 ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 9వ తేదీ వరకూ ఓటరు జాబితాల్లో పేర్లు చేర్పులు, మార్పులు ఏమైనా చేసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా శాశ్వతంగా గ్రామాల్లో లేని వారు, మరణించిన వారి వివరాలను ఓటరు జాబితా నుంచి తొలగించాలని బీఎల్ఓలకు సూచించారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.